ఈ రోడ్డుకు మంచిరోజులు

- వేగంగా నావూరు రోడ్డు నిర్మాణ పనులు
- రూ.10.83 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం



వేగంగా జరుగుతున్న నావూరు రోడ్డు పనులు

పొదలకూరు: దశాబ్ద కాలంగా రోడ్డు ఆధునికీకరణ పనులు చేపట్టక పొదలకూరు మండలంలోని 7 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తద్వారా మండలంలోని ఏడు గ్రామాల ప్రజలు సౌకర్యవంతం ప్రయాణించేలా రోడ్డు నిర్మిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నావూరు రోడ్డు పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం కోసం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో గతేడాది నవంబర్‌లో రూ.10.83 కోట్లు, నావూరు వద్ద పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.3.62 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూపులు

నావూరు రోడ్డుకు గతంలో మరమ్మతులు చేపట్టినా రోడ్డు బాగుపడలేదు. దీంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించారు. సంగం–పొదలకూరు మెయిన్‌రోడ్డు నుంచి ప్రభగిరిపట్నం, అమ్మవారిపాళెం, నావూరు, నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, చేజర్ల మండలం రెడ్డివారికండ్రిక వరకు 23 కి.మీ. పొడవున రోడ్డు పనులను చేపట్టేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఆ నిధులతో ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

చాలారోజులుగా ఎదురుచూస్తున్నాం



రోడ్డు నిర్మాణ పనుల కోసం చాలా రోజులుగా ఎదురుచూస్తున్నాం. ఎంతోకాలంగా ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందులు పడేవాళ్లం. మంత్రి కాకాణి కృషితో రోడ్డు పనులకు నిధులు మంజూరై పనులు వేగంగా జరుగుతున్నాయి. **- సీహెచ్‌ రమేష్, నావూరుపల్లి**

త్వరలో పూర్తి చేస్తాం

రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేస్తాం. నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేయిస్తున్నాం.
– మవేక్‌రెడ్డి, పీఆర్‌ ఏఈ

నేటి నుంచి కోదండరామస్వామి ఉత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అర్చకులు, ఆలయ పాలకమండలి సభ్యులు

కోవూరు: స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న శ్రీకోదండరామస్వామి ఆలయంలో శనివారం నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు పరాంకుశం శ్రీకాంతాచార్యులు తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉత్సవాలను పురస్కరించుకుని దాతలు ఉత్సవ విగ్రహాలైన శేష, హంస, అశ్వ, హనుమ, గజ వాహనాలను సమకూర్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్‌ దుర్గయ్య, గోవర్ధన్‌ గిరిగౌడ్, హర్షవర్ధన్‌రెడ్డి, మల్లికార్జున, గాదిరాజు రాజేష్, వెంకటరమణయ్య, శాంతి దంపతులు, శ్రీనివాసులు, జగన్‌మోహన్‌రెడ్డి, విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్‌



కొండూరుసత్రం వద్ద హైవేపై ఆగిన లారీలు

మనుబోలు: లారీ డ్రైవర్లు మనుబోలు మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్‌ చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో పోర్టు క్రాస్‌రోడ్డు నుంచి బద్దెవోలు క్రాస్‌ అవతలి వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. హైవే పొడవునా దాబా హోటళ్లు ఉన్నాయి. దూరప్రాంతాల నుంచి వచ్చే లారీ డ్రైవర్లు, వాహనదారులు కాఫీ, టిఫిన్, భోజనం కోసం ఈ దాబా హోటళ్ల వద్ద లారీలను నిలుపుతుంటారు. అయితే దాబాల వద్ద సరిపడా పార్కింగ్‌ స్థలం లేకపోవడంతో లారీలను హైవే పైనే నిలిపివేస్తున్నారు. హోటళ్ల వద్దే కాకుండా కాగితాలపూరు క్రాస్‌రోడ్డు, కొండూరు సత్రం వద్ద నిత్యం పదుల సంఖ్యలో ఒకేసారి వాహనాలు హైవేపై నిలిపోతున్నాయి. ఇలా హైవేపై ఆగి ఉన్న లారీలు, ఇతర వాహనాలను ఢీకొన్న ప్రమాదాల్లో గతంలో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. హైవేపై లారీలను ఆపితే కఠిన చర్యలు తీసుకుంటామని తరచూ పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదు. దీంతో లారీ డ్రైవర్లు, ఇతర వాహనాల చోదకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా హైవేపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే కాక.. పలు ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



గ్రామంలో పరిసరాలను పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

విడవలూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా జీవించాలని రామతీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దంపూరు పంచాయతీ రామచంద్రాపురం గ్రామంలో ఐదుగురికి అతిసార వ్యాధి లక్షణాలు ఉండడంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక పీహెచ్‌సీ డాక్టర్‌ అమర్‌నాథ్‌రెడ్డి శుక్రవారం రామచంద్రాపురం గ్రామానికి చేరుకుని పరిశీలించారు. వ్యాధిగ్రస్తుల ఇళ్లలోని నీటి శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం సేకరించి నెల్లూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి వ్యాధి నిరోధక మాత్రలు, ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు సరఫరా చేసినట్లు తెలిపారు. గ్రాస్తులంతా కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ సురేంద్రరెడ్డి, సచివాలయ సెక్రటరీ కిరణ్మయి, ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు కన్యకాపరమేశ్వరి జన్మదిన వేడుకలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీదేవి దేవస్థానంలో శనివారం అమ్మవారి జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్‌ ఆదూరు వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు గోపూజ, 8.30 గంటలకు అమ్మవారికి పంచామృత అభిషేకం, 9.30 గంటలకు అలంకరణ, 11 గంటలకు లలితా సహస్రనామ పూజ, ఖడ్గమాల, 12 గంటలకు హారతి, 12.30 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు రాఘవేంద్ర–ప్రమీల, వాసుదేవరావు–పార్వతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారికి సామూహిక మల్లెల అర్చన, రాత్రి 8 గంటలకు నక్షత్ర హారతి ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అమ్మవారికి ధూళి జాతర

ఇందుకూరుపేట: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నం శ్రీచాముండేశ్వరీదేవి అమ్మవారికి శుక్రవారం ధూళి జాతర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే అమ్మవారి కల్యాణోత్సవానికి నెల రోజుల ముందు ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఆలయం వద్ద నుంచి మేళతాళాలతో గ్రామానికి చేరుకొంటారు. గ్రామోత్సవం అనంతరం ఉత్సవమూర్తులను స్థానిక శివాలయంలో వేంచేపు చేస్తారు. ధ్వజావరోహణం రోజు తిరిగి అమ్మవారు గ్రామం నుంచి ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళతారు. ధూళి జాతర సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

దీపం దొర్లి చెలరేగిన మంటలు

- రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం

నెల్లూరు(క్రైమ్‌): దీపం దొర్లి మంటలు చెలరేగడంతో ఇంట్లోని వస్తువులు దగ్ధమైన ఘటన చంద్రమౌళీనగర్‌ నాల్గోవీధిలో శుక్రవారం చోటు చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు..చంద్రమౌళీనగర్‌ నాల్గోవీధిలో వెంకటేశ్వరరెడ్డికి చెందిన రేకుల ఇంట్లో ఇంద్రాణి కుటుంబం అద్దెకు నివాసం ఉంటోంది. శుక్రవారం ఉదయం దీపారాధన చేసి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో దీపం దొర్లి పడిపోవడంతో పక్కనే ఉన్న బట్టలు అంటుకుని మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే ఇంట్లోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఇంద్రాణి కుటుంబం కట్టుబట్టలతో రోడ్డుపై పడింది. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



యల్లాయపాళెం గ్రంథాలయంలో విద్యార్థులతో కథలు చదివిస్తున్న రిసోర్స్‌పర్సన్‌ శరణ్య

కొడవలూరు: విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాల ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని కొడవలూరు గ్రంథాలయాధికారి కె.రాజేశ్వరి తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులతో కథలు చదివించడం, కథలు చెప్పించడం, క్విజ్‌ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లోని స్వాతంత్ర సమరయోధుల వీరగాథలు, నీతికథలు లాంటివి చదవడం ద్వారా విద్యార్థుల్లో సత్ప్రవర్తన, క్రమశిక్షణ, పోరాటస్ఫూర్తి అలవడుతుందని తెలిపారు. అలాగే యల్లాయపాళెంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ గ్రామంలోని గ్రంథాలయాధికారి జె.సురేంద్రరెడ్డి సూచించారు. యల్లాయపాళెం గ్రంథాలయంలో కూడా విద్యార్థులతో మహనీయుల చరిత్రలు, నీతి కథలు చదివించడం, చెప్పించడం చేశారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు శరణ్య రిసోర్స్‌ పర్సన్‌గా వ్యవహరించారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



విద్యుద్దీపాలంకరణలో మైపాడు శివాలయం

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో కొలువైన శ్రీఅన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలయ ప్రధానార్చకులు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 25వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు వేడుకగా నిర్వహిస్తామని ఆలయ పాలక మండలి చైర్మన్‌ కనుపూరు సురేంద్రబాబు తెలిపారు. 23వ తేదీన స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామి, అమ్మవార్లు ప్రతి రోజూ వివిధ వాహనాలపై విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

ఎన్నికల కౌంటింగ్‌ కేంద్రం పరిశీలన



కౌంటింగ్‌ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(దర్గామిట్ట): కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్‌ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ ఎం హరినారాయణన్, ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్‌ శుక్రవారం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి చివరి అంకమైన కౌంటింగ్‌ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు. వారి వెంట ఎన్నికల, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సేవాతత్పరుడు కోటేశ్వరరావు

- కొత్తలూరు ట్రస్ట్‌ ద్వారా సేవా కార్యక్రమాలు
- రైతులకు ఆదర్శంగా ఆధునిక వ్యవసాయం
- నాటకరంగంలోనూ రాణింపు



కొత్తలూరు ట్రస్ట్‌ ద్వారా ఆర్థికసాయం అందజేస్తున్న కోటేశ్వరరావు(ఫైల్‌)

పొదలకూరు : విశ్రాంత ఉపాధ్యాయుడైన కొత్తలూరు కోటేశ్వరరావు సేవా కార్యక్రమాలతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాగే వ్యవసాయ, నాటక రంగాల్లోనూ రాణిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. తన తండ్రి పేరుతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పొదలకూరు మండలం ఊసపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కొత్తలూరు కోటేశ్వరరావు ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారు. అంకుపల్లి, పొదలకూరు, మొగళ్లూరు తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో పనిచేసి విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేశారు. అలాగే కొత్తలూరు చారిటబుల్‌ ట్రస్ట్‌ ఏర్పాటు చేసి బడి, గుడి తదితర సౌకర్యాల కోసం ఆర్థికసాయం అందజేశారు. మొగళ్లూరు సిద్దనకొండపై బోరు, మోటార్‌ నిర్మాణానికి ట్రస్ట్‌ ద్వారా రూ.58 వేలు ఖర్చు చేశారు. ఇప్పటి వరకు ట్రస్ట్‌ ద్వారా రూ.3 లక్షలతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా కోటేశ్వరరావు నాటకరంగంలోనూ రాణిస్తూ సాంఘిక, పౌరాణిక నాటకాల్లో పలు పాత్రలు పోషించి కళాకారుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అంతేకాకుండా రైతులు పాత పద్ధతుల్లో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించడం కష్టమని చెబుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ ఆదర్శ రైతుగా నిలుస్తున్నారు. ఇలా ఓ వైపు సమాజ సేవ, మరోవైపు కళాసేవలతో సేవాతత్పరుడిగా ప్రజలు అభినందనలు అందుకుంటున్నారు. ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా, శ్రీషిర్డీసాయిబాబా సేవా సమితి సొసైటీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సేవా కార్యక్రమాలు, ఆధునిక వ్యవసాయం చేస్తూ శేషజీవితం గడపాలని ఆకాంక్షిస్తున్నానని కొత్తలూరు కోటేశ్వరరావు చెబుతున్నారు.

ముత్తుమారికి పవిత్ర జలాభిషేకం



కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): పొదలకూరురోడ్డులోని ఇందిరాగాంధీనగర్‌లో ఉన్న ముత్తుమారి దేవస్థానంలో అమ్మవారి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం అమ్మవారికి పవిత్ర జలాభిషేకం నిర్వహించారు. భక్తులు ఊరేగింపుగా పెన్నానది నుంచి 108 కలశాల్లో జలాలను తీసుకొచ్చి అభిషేకించారు. అనంతరం సంప్రదాయంగా విశేష పూజలు నిర్వహించారు. భక్తులు సుబ్రహ్మణ్యస్వామి శూలాలు ధరించి కావిడీలు మోశారు. సాయంత్రం లలితా సహస్రనామం, సామూహిక కుంకుమార్చన, విశేష భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు ఎస్‌ గోపి పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



లక్ష్మీనరసింహస్వామి చప్పరోత్సవం



ధ్వజారోహణ చేసి గరుడ ప్రసాదాన్ని భక్తులకు పంచుతున్న వేదపండితులు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్‌ మండలం నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోకంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గరుడ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం చప్పరోత్సవం, గిరి ప్రదక్షణను నేత్రపర్వంగా నిర్వహించారు. నెల్లూరు వాస్తవ్యులు ప్రత్తి రమేష్‌బాబు జ్ఞాపకార్థంగా మనుమళ్లు సాయిహర్షితరమేష్,మితిల్‌ రమేష్, కార్తీక్‌ వెంకట్, సోమిశెట్టి వెంకటసుబ్బయ్య ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేత్రపర్వంగా శేష వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం శేష వాహన సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం జరిపారు. సరస్వతి నాట్యమండలి వారి చెంచులక్ష్మి నాటకం, బాలత్రిపుర సుందరి వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించాయి. ఉభయకర్తలుగా దేవరపాళెం వాస్తవ్యులు వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, లక్ష్మీకాంతమ్మ వ్యవహరించారు. ఆలయ ఈఓ వీ గిరికృష్ణ, అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా త్రిపురాసుర అలంకారం



నెల్లూరు(బృందావనం): వైశాఖ మాసం సందర్భంగా మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో వసంతోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి మూలస్థానేశ్వరుడు త్రిపురాసుర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరుడి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఉత్సవం జరిపారు. ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ ఈఓ వేణుగోపాల్‌ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

వీఎస్‌యూ ప్రిన్సిపల్‌కు సన్మానం



ప్రిన్సిపల్‌ను సన్మానిస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది

వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్‌ విజయను శుక్రవారం ఆ విశ్వవిద్యాలయంలోని తన చాంబర్‌లో బోధన, బోధనేతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి



పోలీసు సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్‌

నెల్లూరు(క్రైమ్‌): పోలీసు సిబ్బంది సంక్షేమానికి తన వంతు కృషి చేస్తున్నానని ఎస్పీ ఆరీఫ్‌ హఫీజ్‌ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్‌ డేను శుక్రవారం నిర్వహించారు. సిబ్బంది నుంచి ఎస్పీ స్వయంగా అర్జీలు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలను పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. సిబ్బందితో పాటు వారి కుటుంబసభ్యులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పోలీసు కార్యాలయ మినిస్టీరియల్‌ సిబ్బందిని ఆదేశించారు. బాధ్యతాయుతంగా సిబ్బంది విధులు నిర్వహించాలని, అనధికారికంగా గైర్హాజరైతే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర గస్తీ



నెల్లూరు(క్రైమ్‌): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా నగరంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా చిన్నబజారు ఇన్‌స్పెక్టర్‌ బీ అశోక్‌కుమార్‌ స్టేషన్‌ పరిధిలోని డైకస్‌రోడ్డు, కోటమిట్ట, షాదీమంజిల్, మెక్లిన్స్‌రోడ్డు, ఖుద్దూస్‌నగర్, మన్సూర్‌నగర్, జెండావీధి, తదితర ప్రాంతాల్లో నిరంతర పోలీసు గస్తీని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆయన సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. ఎన్నికల కోడ్‌ ఇంకా అమల్లో ఉందని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నిరుపేద బాలింతకు ఆపన్నహస్తం



నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): నగరంలోని 9వ డివిజన్‌ పరిధిలోని చిన్నబాలయ్యనగర్‌ ప్రాంతానికి చెందిన నిరుపేద బాలింత బుజ్జమ్మకు అమ్మ యూత్‌ ఫౌండేషన్‌ నిర్వాహకుడు రమేష్‌బాబు శుక్రవారం ఆపన్నహస్తం అందించారు. బుజ్జమ్మ మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెతో పాటు బిడ్డకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఫౌండేషన్‌ నిర్వాహకులు ఆమె ఇంటికి వెళ్లి బేబీకిట్, దోమతెర, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్‌ సభ్యులు శరత్‌కుమార్, శశికిరణ్‌ పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌గా జాఫర్‌ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు సిటీ: నెల్లూరు ప్రధాన స్టాంప్స్‌ అండ్‌ రిజిస్ట్రేషన్స్‌ కార్యాలయంలో జాయింట్‌–2 సబ్‌రిజిస్ట్రార్‌గా జాఫర్‌ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముత్తుకూరు సబ్‌ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన డిప్యూటేషన్‌పై నెల్లూరుకు వచ్చారు.

కానిస్టేబుల్‌కు అస్వస్థత

నెల్లూరు(దర్గామిట్ట) : కలెక్టరేట్‌లో విధి నిర్వహణకు వచ్చిన కానిస్టేబుల్‌ మల్లికార్జునరావు శుక్రవారం మధ్యాహ్నం అస్వస్థతకు గురయ్యారు. సహచర పోలీసు సిబ్బందితో పాటు కలెక్టరేట్‌ సిబ్బంది తక్షణమే స్పందించి 108 వాహనంలో కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించారు.